రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# హమాలీలను పెంచుకొని సమస్యను అధిగమించండి

## ధాన్యం సేకరణపై అదనపు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి

**వికారాబాద్, ప్రభాతవార్త :** వరి ధాన్యం సేకరణకు రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం సేకరణపై రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి మిల్లరు 2 లక్షల 20 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకునే విధంగా అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. జూన్ 6వ తేదీ వరకు లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి ధాన్యాన్ని మిల్లర్లు సేకరించాలని ఆయన తెలిపారు. జిల్లాలో గల 130 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఎప్పటికప్పుడు మిల్లర్లకు తరలించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అశ్రద్ధ చూపకుండా ధాన్యం సేకరణ జరగాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలో జాప్యం అవుతుందని, హమాలీల సంఖ్యను పెంచుకొని సమస్యను అధిగమించాలని ఆయన తెలిపారు. లారీ ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో చేర్చేందుకు లారీల సంఖ్యను పెంచుకోవాలని ఆయన సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, తూనిక, తేమ యంత్రాలు ఉండేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. వరి ధాన్యం నిల్వల నిమిత్తం అదనంగా మధ్యంతర గోదాములకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల జనరల్ మేనేజర్ అభిషేక్, డీజీఎం ఇర్ఫాన్, సూపరింటెండెంట్ ఇద్రీష్, పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా సహకార అధికారి నాగార్జున, డిసిఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ వెంకట్ రామ్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ నర్సింలు, డిపిఎం కొమురయ్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్త, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# పంట చేతికొచ్చినా పడిగాపులేనా!

★ అకాల వర్షం వస్తే మా గతేంటి ★ ఐదు రోజులుగా ధాన్యం తీసుకోవడంలేదు ★ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం ★ లారీలు సమకూర్చి కొనుగోళ్లు పునరుద్ధరించే వరకూ పోరాటం ఆగదు ★ శామీర్‌పేట రైతుల హెచ్చరిక ★ రాజీవ్ రహదారిపై రాస్తారోకో ★ స్తంభించిన రాకపోకలు



ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘాల నేతలు

**శామీర్‌పేట, జూన్ 3 ప్రభాతవార్త:** వరిధాన్యం కొనుగోళ్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా శామీర్‌పేట రాజీవ్ రహదారి నల్సార్ చౌరస్తా వద్ద రైతులు భారీ ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు బుధవారం రైతులకు మద్దతుగా ఈ రాస్తారోకో జరిగింది. ఐదు రోజులుగా నిలిచిన కొనుగోళ్లశామీర్పేట రైతు సేవా సహకార సంఘం పరిధిలోని శామీర్‌పేట, అలియాబాద్, జగ్గంగూడ, కేశవరం, మూడుచింతలపల్లిలక్ష్మాపూర్, ఉద్దెమర్రి కొనుగోలు కేంద్రాలలో గత ఐదు రోజులుగా ధాన్యం సేకరణ పూర్తిగా నిలిచిపోయింది. కేంద్రాల్లో సేకరించిన బస్తాలు తరలించడానికి లారీల కొరత ఉండటం, అటు కొల్లూర్ రైస్ మిల్లులోనూ స్థలం లేకపోవడంతో కొత్తగా వచ్చే ధాన్యానికి చోటు లేకుండా పోయింది. దీంతో కోతలు పూర్తి చేసుకుని ఐదు రోజులుగా కేంద్రాల వద్దే కాపలా కాస్తున్న రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యంపై రైతు సంఘం ఆగ్రహం**

ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డి.జి. నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... లారీలు అందుబాటులో లేకపోవడం వల్లనే కొనుగోళ్లు నిలిచిపోయాయని, దీనికి సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని అన్నారు.

అకాల వర్షాలు కురిస్తే వరిధాన్యం పూర్తిగా దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారని, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ వెంటనే స్పందించి లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరింత నిర్లక్ష్యం చేస్తే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. రైతుల ధర్నాతో రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు.

అనంతరం ఆయన సివిల్ సప్లైస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుగుణ బాయితో, సొసైటీ చైర్మన్ ఆర్. మధుకర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు.

సమస్యలను రాస్తారోకోల ద్వారా కాకుండా, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

లారీలు సమకూరి, కొనుగోళ్లు సజావుగా సాగే వరకు తమ పోరాటం ఆపబోమని రైతులు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యవర్గసభ్యులు బి. రాజిరెడ్డి, ఎన్. రమేశ్ యాదవ్, ఎం. శ్రీకాంత్ రెడ్డి, సిహెచ్ నాగిరెడ్డి, నీరుడి బాలు, జి. పశుపతి, మహేశ్ యాదవ్, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాతృత్వపు వేదనతో మృత్యు ఒడికి..

## సంతానం కలగడంలేదని విరక్తి చెంది ఆత్మహత్య

**రంగారెడ్డి అర్బన్ జూన్ 3, ప్రభాతవార్త :** పిల్లలు పుట్టడం లేదని మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఆదెల్ల సుక్కాపురి స్వప్న (36)కు 2021లో ఏ.ఎస్. శ్రీకాంత్ అలియాస్ శివతో వివాహం జరిగింది. భర్త గత రెండేళ్లుగా ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటుండగా, స్వప్న గొల్లపల్లిలోని తన అత్తమామలతో కలిసి ఉంటోంది. వివాహమై ఐదేళ్లు కావస్తున్నా పిల్లలు పుట్టడం లేదనే బాధతో ఆమె కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురవుతోంది. ఈనెల 2వ తేదీ ఉదయం ఆమె తన సోదరి లావణ్యతో వీడియోకాల్లో మాట్లాడుతూ పిల్లలు లేరనే బాధను చెప్పుకుని కన్నీరుమున్నీరైంది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించలేదు. సాయంత్రం ఎంతకీ గది తలుపులు తీయకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా, ఆమె ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. పిల్లలు లేరనే విరక్తితోనే ఆమె ఈ దారుణానికి ఒడిగట్టినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఫార్మాసిటీ బాధిత రైతులు, గ్రామస్థులు

# మేడిపల్లిలో ఫార్మా సెగ

**తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన భూముల వివాదం**

**పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు**

**కేసు కోర్టులో ఉండగా..పనులు చేస్తున్నారని మండిపాటు**

**జీవనాధారమైన భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఆందోళన**

**యాచారం, మే 3, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నక్కర్త మేడిపల్లి గ్రామంలో నగర్తి మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ భూముల వ్యవహారం బుధవారం నాడు తీవ్ర ఉద్రిక్తకు దారితీసింది. వివాదం కోర్టులో కొనసాగుతున్నప్పటికీ, కేసులు నమోదైనప్పటికీ.. ఫార్మాసిటీ భూముల్లో చట్టవ్యతిరేకంగా పనులు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ కూలీలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున నక్కర్త మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు భారీ ధర్నాకు దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ పేరుతో తమ భూములను బలవంతంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఫార్మాసిటీ భూముల్లో జేసీబీలు, యంత్రాలతో పనులు కొనసాగుతుండటంతో స్థానిక ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది. ధర్నాలో పాల్గొన్న మహిళలు మాట్లాడుతూ.. తమ కుటుంబాలకు జీవనాధారమైన భూములను ప్రభుత్వం రక్షించాలని కోరారు. పేదల భూములను కాపాడాలి.. కేసులు ఉన్న భూముల్లో పనులను వెంటనే ఆపాలి..అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు.

ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. చట్టపరమైన వివాదం ముగిసే వరకు భూముల్లో ఎలాంటి పనులు చేయకూడదని, అధికారుల నిర్లక్ష్యంతో కొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారని స్థానికులు పోలీసుల ముందు వాపోయారు. ఫార్మాసిటీ భూముల్లో జరుగుతున్న పనులను వెంటనే నిలిపివేసి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసు చట్టపరమైన పరిధిలో ఉందని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ, బాధితులు మాత్రం తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఫార్మాసిటీ భూముల వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ భూముల వివాదంపై ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

# గ్రామీణాభివృద్ధికి అగ్రి బిజినెస్

**శామీర్‌పేట, జూన్ 3 ప్రభాతవార్త:** భారత్-నైజీరియా దేశాల మధ్య స్నేహం, సహకారం పెరగడానికి సీడ్ ప్రపంచ శిక్షణ ఒక ప్రతిబింబంగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి వ్యాపారం ఎంత ముఖ్యమో, అగ్రి బిజినెస్ (వ్యవసాయ వ్యాపారం) అభివృద్ధి కూడా అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీంపేటలోని ఇన్స్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్‌లో భారత్‌నైజీరియా సహకారంతో నిర్వహించిన సీడ్ అంతర్జాతీయ శిక్షణ ముగింపు, కాన్వోకేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. నైజీరియాలోని టరాబా సీడ్స్ లిమిటెడ్, భారత్లోని ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐపీఈ సంయుక్తంగా... టరాబా రాష్ట్ర ప్రభుత్వం (నైజీరియా), ప్రసాద్ అగ్రిటెక్ ఎఫ్‌డీసీ, దుబాయి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. టరాబా రాష్ట్ర యువతకు సీడ్ ఎడ్యుకేషన్, ఎంటర్ప్రైజ్ డెవలప్‌మెంట్ రంగాల్లో నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణ సాగింది. ఈ సంస్థాగత సహకారం వ్యవసాయ పరిపాలనను, సామర్థ్య నిర్మాణాన్ని బలోపేతం చేస్తుందని చెప్పారు. రైతులను ఖండాల మధ్య కలిపే తన దృక్పథాన్ని ప్రసాద్ సీడ్స్, ప్రసాద్ అగ్రిటెక్ ఎఫ్‌డిసి వ్యవస్థాపక చైర్మన్ ప్రసాద్ కరుమంచి పంచుకోగా.. ఆధునిక సీడ్ టెక్నాలజీపై నైజీరియా యువతకు అందించిన ప్రత్యక్ష అనుభవ శిక్షణా మాడ్యూళ్లను టరాబా సీడ్స్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ జి. దిలీప్‌కుమార్ వివరించారు. అనంతరం




సమావేశంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌వెంకట్‌స్వామి, ఐపిఇ బోర్డు అధ్యక్షులు కాకి మాదవరావు, అగ్రిటెక్ ఎఫ్‌డిసి వ్యవస్థాపక చైర్మన్ ప్రసాద్

## సీడ్ అంతర్జాతీయ శిక్షణ ముగింపు సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ ట-రాబా రాష్ట్రాల మధ్య ఉన్న సహకార అవకాశాలను ప్రస్తావించారు. నైజీరియాకు చెందిన సుమారు 30 మంది యువత మూడు వారాల పాటు ఐపీఈలో ఉండి సీడ్స్ శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. వ్యవసాయ, వ్యాపార ప్రారంభానికి, నైపుణ్యాభివృద్ధికి కార్మిక సంక్షేమానికి గల ప్రాధాన్యతను యువతకు వివరించారు. కొత్త ఆవిష్కరణలు కార్మికుల జీవనోపాధిగా మారాలని ఆయన ఆకాంక్షించారు.

**వ్యవసాయ ఆధునికీకరణే ధ్యేయం**

శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ డాక్టర్ డి. రాజిరెడ్డి మాట్లాడుతూ.. వాతావరణానికి అనుకూలమైన పద్ధతులు, ఉద్యానవన ఆవిష్కరణలు, జ్ఞాన మార్పిడి ద్వారా గ్రామీణ జీవనోపాధిని మార్చవచ్చని అన్నారు. ఐపీఈ బోర్డు అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అతిథులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. టరాబా రాష్ట్ర వ్యవసాయ శాఖ పర్మనెంట్ సెక్రటరీ డాక్టర్ అలీ సారా సాబో దంజుమా, టీఏజీఐఎస్ డైరెక్టర్ జనరల్ శిక్షణార్థులను అభినందించారు. టరాభా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బుకెఫాస్ ప్రత్యేక సందేశాన్ని పంపుతూ.. ఈ శిక్షణలో పొందిన జ్ఞానాన్ని ఆహార భద్రత, అభివృద్ధి కోసం ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ అకాడమీని ప్రారంభించారు. ఇది డిజిటల్ లెర్నింగ్‌లో కొత్త యుగానికి సంకేతమని, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో ఇదొక ముఖ్యమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబాసిడర్స్ డాక్టర్ కె. వీరాంజనేయులు, రాజశేఖర్, టీపీ. నాగేంద్రప్రసాద్, ఇతర అధ్యాపక బృందం పాల్గొని మద్దతు పలికారు. వ్యవసాయాన్ని ఆధునీకరించడం, యువతను శక్తివంతం చేస్తూ స్థిరమైన వ్యాపారాలను నిర్మించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం విజయవంతమైంది.

# మొయినాబాద్‌లో డ్రగ్స్ కలకలం

**కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు**

**నిషేధిత మాదకద్రవ్యాలు స్వాధీనం..**

**ఇద్దరు నిందితుల అరెస్ట్**



**మొయినాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** యువతను, ముఖ్యంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నిషేధిత మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠాను మొయినాబాద్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జేబీఐటీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని టీ టైం పాయింట్ వద్ద ఎండీఎంఏ అనే నిషేధిత మాదకద్రవ్యాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ ఎస్పై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం, జేబీఐటీ కళాశాల పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు విద్యార్థులకు నిషేధిత మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు మంగళవారం సాయంత్రం టీ టైం పాయింట్ వద్ద పంచుల సమక్షంలో ఆకస్మిక దాడి నిర్వహించారు. దాడిలో హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన దిల్బీర్ సింగ్ (30), జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖాదర్ భాషా (25)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. విచారణలో వారు విద్యార్థులు యువతకు మాదకద్రవ్యాలు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం నిందితులను రాజేంద్రనగర్ న్యాయ స్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మాదకద్రవ్యాలు ఎక్కడి నుంచి తెచ్చారు, మరెవరికైనా సరఫరా చేశారా, వారి వెనుక మరింత పెద్ద ముఠా ఉందా అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పై వెంకన్న మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు. విద్యార్థులు, యువకులు ఇలాంటి ముఠాల మాయమాటలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల కొనుగోలు, విక్రయం, రవాణా వంటి కార్యకలాపాలపై చట్టంలో కఠినమైన శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. కళాశాలల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టేందుకు నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ అరెస్టు జరిగిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# విహారయాత్రలో విషాదం

## కాగ్నా నదిలో మునిగి ఇద్దరు గల్లంతు

**యాలాల, జూన్ 3, ప్రభాతవార్త:** కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడపాలని వెళ్లిన ఆ ఇళ్లల్లో చూస్తూనే ఉండగా విషాదం నిండింది. విహారయాత్ర కాస్తా ఆ కుటుంబాల పాలిట శాపంగా మారింది. కాగ్నా నదిలో ఈత కొడుతూ ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందిన అత్యంత విచారకరమైన సంఘటన వికారాబాద్ జిల్లా యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా పాత తాండూరు ప్రాంతానికి చెందిన మోయినోద్దీన్ (28), రహమత్ అనే ఇద్దరు యువకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మధ్యాహ్నం యాలాల మండలం కోకట్ గ్రామ శివారులోని కాగ్నా నదికి విహారయాత్రకు వెళ్లారు. నదీ తీరాన అందరూ కలిసి ఎంతో సంతోషంగా భోజనాలు ముగించారు.

**స్నేహితుడిని కాపాడబోయి..**

ఆ తర్వాత మోయినోద్దీన్ సరదాగా ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. అయితే, అతనికి సరిగ్గా ఈత రాకపోవడంతో ఒక్కసారిగా నీటిలో మునిగిపోసాగాడు. నదిలో మునుగుతూ కొట్టుమిట్టాడుతున్న మోయినోద్దీన్‌ను చూసి ఒడ్డున ఉన్న రహమత్ చలించిపోయాడు. ఎలాగైనా తన స్నేహితుడిని కాపాడాలనే ఆరాటంతో వెంటనే నదిలోకి దూకాడు. కానీ, దురదృష్టవశాత్తూ ఒకరినొకరు రక్షించుకునే క్రమంలో నీటి ప్రవాహానికి ఇద్దరూ నదిలోనే మునిగిపోయారు. కళ్ల ముందే ఇద్దరు యువకులు నీట మునిగిపోవడంతో ఒడ్డున ఉన్న కుటుంబ సభ్యులు భయాందోళనలతో గట్టిగా కేకలు వేశారు. వెంటనే కుటుంబ సభ్యులు యాలాల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక గజ ఈతగాళ్లను రంగంలోకి దించి నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపులో మోయినోద్దీన్ (28) మృతదేహం లభ్యం కాగా, నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మరో యువకుడు రహమత్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో నదిలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు. చేతికి అందిన కొడుకులు కళ్ల ముందే నదిలో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో పాత తాండూరులో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వారిని కన్నీరు పెట్టించాయి.



డిల్లీలో కేంద్ర పంచాయత్ రాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ, మోత్కుపల్లి సర్పంచ్ బైండ్ల అమృతమ్మ

# మోత్కుపల్లికి గుడ్ గవర్నెన్స్అవార్డు

**జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు - కేంద్ర మంత్రి చేతుల మీదుగా పురస్కారం**

**కోట్‌పల్లి, జూన్ 3, ప్రభాతవార్త:** పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలు, అన్న మాటను నిజం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచింది. గ్రామ పంచాయతీ ప్రగతిలో దుసుకెళుతూ...జాతీయ స్థాయిలో గుడ్ గవర్నెన్స్ కింద 3వ ర్యాంకు సాదించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామం గుడ్ గవర్నెన్స్ విభాగంలో జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకోని జాతీయ పురస్కారాల అవార్డు సొంతం చేసుకుంది. ఆ గ్రామం గ్రామీణ పాలనతో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2023-2024 ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలలో (డీడీయుపిఎస్‌వీపి) అవార్డు కైవసం చేసుకొని తెలంగాణ రాష్ట్రంలో సరికొత్త రికార్డు సృష్టించింది. వికారాబాద్ జిల్లా మోత్కుపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు అవార్డు ఢిల్లీలో జరిగిన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో బుధవారం నాడు కేంద్ర పంచాయత్ రాజ్ శాఖామాత్యులు శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) చేతుల మీదుగా, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ బైండ్ల అమృతమ్మ నారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి, కోట్‌పల్లి మండల ఎంపీడీఓ, హేమంత్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, మోత్కుపల్లి మాజీ సర్పంచు భీమయ్య, ఉప సర్పంచు పి, మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.

**ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయండి**

**తాండూరు పోలీసులకు ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశం**

2

## ఉపసర్పంచుల సంఘం అధ్యక్షునిగా ప్రకాష్‌గౌడ్

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** ఫరూక్ నగర్ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షునిగా కిషన్‌నగర్ ఉపసర్పంచ్ ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షునిగా ఎర్రోళ్ల అశోక్, ఇతర పదవులకు కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎన్నుకున్న ఉపసర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తానని చెప్పారు. ఉపసర్పంచులకు వేతనాల సాధన కోసం సంఘటితంగా కృషి చేస్తామని వెల్లడించారు. అలాగే గ్రామాల అభివృద్ధికి సంబంధించి అన్ని ఉపసర్పంచులు కలిసి చర్చించి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సరిపడా గ్యాస్ సిలిండర్లను సబ్సిడీతో ప్రభుత్వం అందించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ను ఆయన నివాసంలో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు టిఫిన్ కార్యక్రమాన్ని అమలు చేస్తే, మధ్యాహ్న భోజన కార్మికులకే శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగించాలని కోరారు. అక్షయ పాత్ర వంటి ట్రస్టులకు కాకుండా ఈ పనులను మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సంవత్సరానికి 10 నెలలకే గౌరవ వేతనం చెల్లిస్తున్నారని, దానిని 12 నెలలకు పొడిగించాలని డిమాండ్ చేశారు. అలాగే 60 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.1 లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్, 58 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.3 వేల పెన్షన్ అందించాలని కోరారు. ప్రతి నెల ఒకటో తేదీలోపు బిల్లులు చెల్లించడం, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించడం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేయడం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, రూ.5 లక్షల ప్రమాద బీమా అందించడం వంటి డిమాండ్లను కూడా వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు అక్కమ్మ, సత్తెమ్మ, నిర్మల, అనిత, నీలమ్మ, షాహినా బేగం, ఖైరున్, సావిత్రి, కళావతి, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పాటిమీదిపల్లిలో నూతన బోరు ఏర్పాటు చేయించిన సర్పంచ్

## పాటుమీదిపల్లిలో నూతన బోరు ఏర్పాటు

**కొడంగల్, జూన్ 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పాటుమీదిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కవితసంతోష్‌కుమార్ బుధవారం నూతన బోరు వేయించారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రత్యే నిధులతో గ్రామంలో నూతన బోరు వేయించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. నూతన బోరు ఏర్పాటుతో గ్రామస్థుల తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు. నూతన బోరు ఏర్పాటుకు ప్రత్యేకంగా నిధులు మంజూరీ చేయడం పట్ల సీఎంకు సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సేవే హరీష్ రావు లక్ష్యం

**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**



హరీష్ రావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, శాసనసభ ఉపపక్ష నేత హరీష్ రావు గారి జన్మదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న హరీష్ రావు గారు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షి స్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ శ్రేణులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురు బీహార్ యువకులు దుర్మరణం

**నందిగామ, జూన్ 3, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రం శివారులో 44 వ బైపాస్ జాతీయ రహదారి సర్వీస్ రహదారిపై బుధవారం సాయంత్రం మోటార్ సైకిల్ షిఫ్ట్ కార్ ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు బీహార్ కు చెందిన రోషన్ (20), పంకజ్ 19) సంవత్సరాల యువకులు దుర్మరణం చెందారు. భారీ వర్షం పైగా సర్వీస్ రోడ్లో ఇరువైపులా విద్యుత్ సిబ్బంది చెట్లు నరికి వేయడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చా..? ఇరువురు యువకులు మద్యం తాగి ఉంటారా..? అనే అనుమానాలు రేకెత్తున్నాయి. ఇరువురు యువకులు ప్రమాద సంఘటన పరిసర ప్రాంతాల్లో ఉన్న ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై నందిగామ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఇరువురు బీహార్ మహిళలు మృతి చెందిన ఘటన మరువక ముందే ఇద్దరు బీహార్ యువకులు మృతి చెందడంతో ఈ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది.

# అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

### అదనపు కలెక్టర్ కిరణ్మయి..

**చేవెళ్ల, జూన్ 3, ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు బాధ్యతగా పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం చేవెళ్ల మండలంలోని మడిమ్యాల్ గ్రామాన్ని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. జిల్లా పంచాయతీ అధికారి సురేష్మొహన్, డీఆర్డీఏ ఆదనపు పీడి ను భాషిణి, చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఉన్న పల్లెప్రకట్రుతివనం, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ సెంటర్ ను అదనపు కలెక్టర్ సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామ సభలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నాడు. గ్రామంలో అన్ని శాఖల అధికారులతో అనదపు కలెక్టర్ కిరణ్మయి సమీక్షి ంచారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల పనితీరు బాగాలేదని వెంటనే సరి చేసుకోవాలని విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పశుసం వర్ధక శాఖ అధికారులు భాధ్యతయుతంగా పని చేయాలని ఆదేశించారు. వర్షాలకాలం కావడం రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల పట్ల అధికారులు, సిబ్బంది నిరక్ష ్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



గ్రామాల్లో ఇళ్లు లేని వారు ఉంటే ఇందిరమ్మ ఇళ్లు కోసం ఆయా గ్రామ పంచాయతీలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలతో అధికారులు, సిబ్బంది బాధ్యతయుతంగా మెలగాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య, ఎంపీడీవో బన్సీలాల్, ఏపీఎం రవీందర్, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**చేవెళ్ల, జూన్ 3, ప్రభాతవార్త :**

గ్రామాల్లో అర్హులైన పేదలందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుం దని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండలంలోని చన్వెల్లి, ఇక్కరెడ్డిగూడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 8 ఇందిరమ్మ ఇళ్లను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించి లబ్దిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో గుడిసేలు ఉండొద్దన్న లక్ష్యంతో ప్రభుత్వం అర్హులైన పేదలకు రాజకీయ పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్రెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఆధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్లు లావణ్యశంకర్, భీమాయ్య, నాయకులు, గ్రామస్తులు, లబ్దిదారులు, మహిళలు తదితరులు ఉన్నారు.



శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన మండల విద్యా అధికారి ఆర్.కమలాకర్,పాల్గొన్న ఉపాధ్యాయుల దృశ్యం

# విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు

**శామీర్‌పేట, జూన్ 3, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేయటానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు శామీర్‌పేట మండల విద్యా అధికారి ఆర్.కమలాకర్ పంపిణీ చేశారు. బుధవారం శామీర్‌పేట మండల విద్యా (వనరుల) అధికారి కార్యాలయంలో 2026–2027 విద్యా సంవత్సరంకు సంబంధించి వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం పాఠ్యపుస్తకాలను పంపిణీని ప్రారంభించి ఎంఇఒ కమలాకర్ అందజేశారు. తొలి విడతగా శామీర్‌పేట మండలానికి 14,506 పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం నుంచి అందినట్లు, మరో విడత రెండు, మూడు రోజుల్లో మరిన్ని పాఠ్యపుస్తకాలు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మోసపూరిత ప్రచారాన్ని యువత నమ్మవద్దు

**ఘట్‌కేసర్, జూన్ 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెనపై కొందరు నాయకులు చేస్తున్న రాజకీయాలను మానుకొని అభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఓబిని మంజూరు చేసి 2013లో శంకుస్థాపన చేసిందని ప్రారంభోత్సవం కూడా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఘట్‌కేసర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రైల్వేవంతెన పనులు 80 శాతం పూర్తి అయ్యాయని మరో నాలుగైదు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. వంతెనకు అవసరమైన నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందని పనులు పూర్తి కాగానే దశలవారిగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. వంతెన కోసం ఎవరు కూడా విరాళాలు, స్టీల్, సిమెంట్, ఇసుక, కంకర సేకరించాల్సిన అవసరం లేదని సామాగ్రీ విషయంలో కాంట్రాక్టర్‌కు బాధ్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వంతెన పూర్తి చేయడానికి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు తగిన ఆదేశాలు జారీ చేసిందని ఎవరు కూడా ధర్నాలు, అమరణ దీక్షలు, నిరాహారదీక్షలు, పూజలు చేయాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. వంతెన నిర్మాణంలో భాగంగా గురుకుల్ వైపు అన్ని పిల్లర్లు, శ్లాబుల పనులు పూర్తి చేశారని గేటుకు ఇవతల వైపు పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని మరో మూడు శ్లాబులు వేసే పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. గత 13 సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్న వంతెన పనులు గడిచిన 2 సంవత్సరాలలో వేగవంతం చేయగా 80 శాతం వరకు పూర్తి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఓబిపైకి సంబంధించిన పెండింగ్ బిల్లు రూ.4.18 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు.

ఒక వైపు వంతెన పనులు జరుగుతుండగా కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం యువకులను రెచ్చగొట్టి ఆందోళనలను చేయాలని ప్రోత్సహించే పనులు చేస్తున్నారని ఈవిషయాన్ని యువత గమనించాలని ఆయన హితవు పలికారు. మాజీ ప్రజాప్రతినిధులు గత 15 ఏండ్లుగా పదవుల్లో కొనసాగారని కానీ నిజాయితీగా పని వంతెన పూర్తి చేయించకుండా అడ్డంకులు సృష్టించి ఇప్పుడు సోషల్‌మీడియాలో తామే అంటూ గొప్పలు చెప్పుకోవడాన్ని ప్రజలు నమ్మరని పని చేసి అభివృద్ధిని చేసి చూపించే కాంగ్రెస్ ప్రభుత్వం వైపు ఉంటారని ఆయన పేర్కొన్నారు. వంతెన విషయంలో కొందరు ప్రజలను పక్కదారి పట్టించి లేనిపోని అపోహాలు సృష్టించి పేరుకోసం రాజకీయ లబ్ది పొందడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజాఅవసరాలను దశలవారిగా తీర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల పాటు అధికారంలో ఉందని వంతెనను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన పూర్తి చేస్తుందని దీనిపై యువత, గేటు అవతల ప్రజలు, మహిళలు ఆందోళన చెందకూడదని ముత్యాలుయాదవ్ కోరారు.

## అక్రమంగా గుట్కా నిల్వలు నిందితుడి అరెస్టు..

**చేవెళ్ల, జూన్ 3, ప్రభాతవార్త :** అక్రమంగా గుట్కా పాన్ లను నిల్వ చేసుకున్న నిందితుడిని చెవెళ్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఐపి ఎ. సంతోష్ రెడ్డి, పీసి ఆనంద్, హెచ్ వెంకటయ్యలతో కలిసి గస్తీ నిర్వర్తిస్తుండగా, చెవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చెవెళ్ల గ్రామ రోడ్డులో ఉన్న బాలాజీ జనరల్ స్టోరీలో ఒక వ్యక్తి నిషేధిత గుట్కా. పాన్ మసాలా మరియు పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు. సమాచారంపై చర్య తీసుకుంటూ, మేము వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి సదరు దుకాణంలో తనిఖీ నిర్వహించాము. తనిఖీ సమయంలో, ఆ దుకాణం నిషేధిత పొగాకు ఉత్పత్తులను కలిగి ఉండి, విక్రయిస్తున్నట్లు మేము కనుగొన్నాము.



విచారణలో, సంబంధిత చట్టాలు మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఖచ్చితంగా నిషేధించబడిన ఈ నిషేధిత వస్తువులను నిల్వ చేయడానికి మరియు విక్రయించడానికి నిందితుడు ఎటువంటి అధికారం, లైసెన్స్, అనుమతి లేదా సంబంధిత పత్రాలను సమర్పించడంలో విఫలమయ్యాడు. ఈ మేరకు ఎల్లప్పను అరెస్టు చేసినట్లు తెలిపారు.

### పాల ఉత్పత్తి పెరుగుదలకు
## నాణ్యమైన పశుగ్రాసం అవసరం

**షాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** పాల ఉత్పత్తి పెరుగుదలకు నాణ్యమైన పశుగ్రాసం అవసరమని హైదరాబాద్ ప్రాంతీయ పశుగ్రాస క్షేత్రం డైరెక్టర్ డాక్టర్ అంజుబసేరా అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో నాణ్యమైన పశుగ్రాస విత్తనాల ఎంపిక, పాల పశువుల నిర్వహణలో ఉత్తమ పద్ధతులు అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించి, స్థిరమైన పాల పశు సంరక్షణ విదానాలు, శాస్త్రీయ డెయిరీ నిర్వహణ, గొర్రెల పెంపకంలో పాటించాల్సిన ఉత్తమ పద్ధతులు, పశువుల ఆరోగ్య సంరక్షణ, సమతుల్య మేత, వ్యాధి నివారణ చర్యలు, శాస్త్రీయ పద్ధతుల ద్వారా అధిక లాభాలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమీర్‌పేట్ గోవర్ధన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ సుధీర్, దిలీప్, రామకృ ష్ణ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్, ఉపసర్పంచ్ మాణిక్యం, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## వర్షాల సమయంలో అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలి

**ఘట్‌కేసర్, జూన్ 3, ప్రభాతవార్త:** వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలకు అవసరమైన అత్యవసర సహాయక చర్యలు చేపట్టేందుకు సమన్వయంతో పని చేయాలని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమీషనర్ అల్లూరి వాణిరెడ్డి తెలిపారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులు, పోలీసు విభాగం అధికారులు, సిబ్బందితో వర్షాకాల సంసిద్ధత సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా వర్షాకాలంలో ప్రజారక్షణకు, అత్యవసర సేవల సమ న్వయానికి మున్సిపల్, పోలీసు విభాగాల సిబ్బంది క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నాలా పూడిత, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ కుండా డ్రైనేజీ, నాలాలలోని చెత్తను తొలగించాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కల్వర్టులనశు



భ్రం చేయాలని, మ్యాన్‌హోల్స్ పర్యవేక్షిస్తూ తెరచి ఉన్న వాటికి మూతలు వేయాలని తెలిపారు. ప్రమాదకరమైన చోట్ల హెచ్చరికబోర్డులు పెట్టాలని, అత్యవసర బృందాలు చెట్లు విరిగిపడినా, నీరు నిలిచినా వెంటనే స్పందించి డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, రసాయనాల పిచికారీ, దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం ఫాగింగ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మళ్లింపు, నీరు ఎక్కువగా నిలిచేరోడ్లను గుర్తించి ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మార్గాలను సిద్ధం చేసుకోవాలని, భారీవర్షాల సమయంలో వాహనాలు నిలిచిపోకుండా జంక్షన్లలో అదనపు సిబ్బందిని కేటాయించాలని, రోడ్లపై గుంతలు ఉన్న చోట వాహనదారులను అప్రమత్తం చేసేం దుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పౌర పోలీసులు మున్సిపల్ అధికారులతో కలిపి 24/7 కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించడంలో సహాయపడాలని, పుకార్ల నియంత్రణకు, వర్షాలు, వరదలపై సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాన్ని ఆరికట్టాలని పేర్కొ న్నారు. ఈసమావేశంలో సహాయ పట్టణ ప్రణాళిక అధికారి రాజీవ్‌రెడ్డి, డిప్యూటి ఇంజినీర్ నరేష్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ మన్నె విజయకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయండి

**తాండూరు పోలీసులకు ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశం**

**తాండూరు, జూన్ 3, ప్రభాతవార్త :** పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించేలా దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. బుధవారం తాండూరు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సందర్శించారు. సాధారణ వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్ రికార్డులు, భద్రత, పరిశుభ్రత, కార్యనిర్వాహణ, సిబ్బంది విధి నిర్వాహణ తీరును నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ సీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులతో పాటు స్వాదీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు, కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చొరవ చూపాలని అన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య ఎలాంటి అంతరాలు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండి అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్‌లో ఎలాంటి రికార్డులను పెండింగ్‌లో పెట్టకూడదని, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల రక్షణ, వారిపై జరిగే నేరాలు, కేసుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ, ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాస్త్ర సాంకేతికతను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. పట్టణంలో సమస్యాత్మక, ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసి నిఘాను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.



అభివృద్ధి పనులపై గ్రామస్థులను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మేన్

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్**

**కొడంగల్, జూన్ 3, ప్రభాతవార్త:**

మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌తో కలిసి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు గుండ్లకుంటలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన పనులు ముందుకు కొనసాగకుండా ఎందుకు నిలిచిపోయాయని గుండ్లకుంట గ్రామస్థులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలో ఏ ఒక్క పనులు కూడా పెండింగ్‌లో ఉంచకూడదని ఏఈ సంతోష్‌ను ఆదేశించారు. గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు సాగేలా గ్రామస్థులు సమకారం అందించాలని, అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

## మండల ప్రత్యేక అధికారి సమీక్ష సమావేశం

**యాచారం, మే 3, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు ప్రజలు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని మండల ప్రత్యేక అధికారి మాధవరావు అన్నారు. బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె ప్రగతి ప్రణాళిక లో భాగంగా జూన్ 4, 6 ,8 ,10 తేదీల్లో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో క్లస్టర్లుగా గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష, తీర్మానాలు చేపట్టాలని అన్నారు. గ్రామ సభలో వర్షాకాలం సన్నద్ధమైన సందర్భంగా పరిశుభ్రత, తడి పొడి వ్యర్థ పదార్థాల చెత్త సేకరణ, తదితర అంశాలపై సమీక్షి ంచి గ్రామాల్లో తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఉంటుందన్నారు. ఎంపీడీవో రాధా రాణి, తాసిల్దార్ అయ్యప్ప, ఎంపీఓ శ్రీలత, ఎంఈఓ, ఏపీఓ, ఏపీఎం, వ్యవసాయ శాఖ అధికారులు, పరిశ్రమవర్ధక శాఖ అధికారులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, తదితరులు ఈ కార్యక్రమాన్ని పాల్గొన్నారు.

## ఉత్తమ సిఈఓగా బక్కరెడ్డి

**కుల్కచర్ల, జూన్ 3, ప్రభాతవార్త:** తెలంగాణ ఆవిర్భావదినోత్సవ ం సందర్భంగా ఉత్తమ విధులు నిర్వహించిన అధికారులకు జిల్లా కేంద్రం లోని జిల్లా అధికారులు ప్రశంసా పత్రాలను అందజేశారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఈఓగా విధులు నిర్వహిస్తున్న బక్కరెడ్డికి ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. ఉత్తమ ఉద్యోగిగా ఎంపికకావంతో మండల ప్రజలు, నాయకులు బక్కరెడ్డికిశుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బక్కరెడ్డి మాట్లాడుతూ..వృత్తిని భారంగా కాకుండా బాధ్యతగా చేస్తే ఫలాలు వాటి అంతట అవే వస్తాయని, ఆధిశగాతాను మొదటి నుంచే ప్రయత్నిస్తానని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి

**కొడంగల్, జూన్ 3, ప్రభాతవార్త:**

విద్యుత్ షాక్‌కు గురై రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..కొడంగల్ పట్టణానికి చెందిన పసుల అర్జునప్ప రోజు మాదిరిగా తన గేదెలను మేత కోసం పట్టణ శివారులోని వ్యవసాయ పొలాలకు తీసుకువెళ్ళాడు. ఈ క్రమంలో బుధవారం శ్రీనివాస్‌కు చెందిన పొలంలో మేత మేస్తుండగా అప్పటికే విద్యుత్ స్థంభం నుంచి తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి రెండు గేదులు మృత్యువాత పడ్డాయని బాధిత రైతు అర్జునప్ప వాపోయారు. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.1లక్ష వరకు ఉంటుందని, గేదుల పాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాని, ఇంతలోనే విద్యుత్ షాక్‌కు గురై గేదెలు మృతిచెందాయని, ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కాగా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం కొడంగల్ కార్యదర్శి మనిగిరి రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**-యూత్ కాంగ్రెస్ నాయకులు..**

**దుద్యాల్, జూన్ 3, ప్రభాతవార్త:** మండలానికి సరఫరా అయిన సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీలో అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారంటూ నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సురేష్ రాజ్ ను యూత్ కాంగ్రెస్ దుద్యాల్ మండల నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించబోధని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, అవినీతి ఆరోపణలను నిరూపించాలన్నారు.

మండలానికి సుమారు 50 లక్షల విలువగల విత్తనాలు సరఫరా అయితే కోటి 40 లక్షల అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపించడం నీ అవివేకానికి నిదర్శనం అన్నారు. యూత్ కాంగ్రెస్ దుద్యాల్ అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ. మండల నాయకులను విమర్శిస్తే తన స్థాయి పెరుగుతుందని సురేష్ భ్రమ పడుతున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని, అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, పార్టీ మారుతానని, మీ నాయకుడిని సైతం బ్లాక్ మెయిల్ చేసిన నువ్వు రైతుల గురించి మాట్లాడదాం సిగ్గుచేటన్నారు. అమాయక రైతులను తప్పుదోవ పట్టిస్తూ వారిని అధికారులపై ఉసుగొల్పి రాక్షసానందం పొందుతున్నారని ఇలాంటి వారితో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేర్గు శ్రీకాంత్, గ్రామ అధ్యక్షుడు పాకాల అనిల్, సభ్యులు మల్లికార్జున్ గౌడ్, సంతోష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

## మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

**ప్రతిభావంతులకు రాష్ట్ర స్థాయి పోటీల్లో అవకాశం**

**జవహర్ నగర్,మే 3, ప్రభాతవార్త:** ఈ నెల 7వతేదీ (ఆదివారం) మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహి స్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ ఆర్గనైజేషన్ కార్యదర్శి కురపాటి రాజశేఖర్ తెలిపారు.అండర్16 బాలబాలికల విభాగంలో 100 మీటర్లు, 300 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ పోటీలునిర్వహించనున్నారు. అండర్18 విభాగంలో 100 మీటర్లు, 1000 మీటర్ల పరుగుపందెం, అండర్20 విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించబడతాయి.

అదేవిధంగా పురుషులు, మహిళల విభాగాల్లో రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ ఈవెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మేడ్చల్ జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 11, 12 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించబడనున్నాయని తెలిపారు.ఆసక్తిగల క్రీడాకారులు జూన్ 7వ తేదీ ఉదయం 7 గంట లకు తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల, హకీంపేట్ గ్రౌండ్‌కు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 98496 12733 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## తలకొండపల్లికి చేరుకున్న ప్రచార జ్ఞాన యాత్ర



తలకొండపల్లిలో ప్రచార బస్సు యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

**తలకొండపల్లి, జూన్ 3, ప్రభాతవార్త:**

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఏర్పాటు చేసిన మహనీయుల జ్ఞాన ప్రచార బస్సు యాత్ర బుధవారం నాడు తలకొండపల్లికి చేరుకుంది. ఈనెల 2న రంగారెడ్డి జిల్లా కడ్తాల మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో పలువురి ఆధ్వర్యంలో ప్రారంభమైన బస్సు యాత్ర బుధవారం నాడు తలకొండపల్లి మండ లంలోని వెల్జాల్ సంఘపెల్లి చంద్రధన తలకొండపల్లి చుక్కాపూర్ గ్రామాల విధిగా ప్రచార రథయాత్ర నిర్వహించారు. తలకొండపల్లిలో ఈ కార్యక్రమాన్ని రథయాత్ర కోఆర్డినేటర్ జి సుధాకర్, మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవిడ్లు హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా తలకొండపల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 2 నుంచి జూన్ 30 వరకు మైసగంటిలో ప్రారంభమైన ప్రచార రథయాత్ర అలం పూర్లో ముగుస్తుందని, నాగర్ కర్నూల్ నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాలలో ఈ మహనీయుల చరిత్రను తెలియ జేసుకుంటూ, ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ రథయాత్రను ఉపయోగించుకుంటున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే కర్తాల్ అను కున్న పెళ్లి ఆమనగల్ మాడుగుల మండలాల్లో రథం ప్రారంభ మైందని అనేక గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్యవంతం చేయ నున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి, దేవిడ్, దళిత నాయకులు, కురుమ సంఘం నాయకులు రాములు, తోపాటు ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గుజ్జుల మహేష్

**తలకొండపల్లి ,జూన్ 3, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్యను బుధ వారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ కలిశారు. మాజీ ఎంపీ రాజయ్య కు తెలంగాణ రాష్ట్ర ఫైనా న్స్ కమిషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కర్తాల గ్రామానికి చెందిన ఆసి ఫాలీకి కమిషన్ సభ్యుడుగా నియామకం చేయడంతో హైదరా బాదులోని ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ కమిటీ సభ్యులు ఆసిఫ్ అలీ, తలకొండపల్లి మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ తదితరులున్నారు.

### బాబు జగ్జీవన్ రామ్ సంఘం కార్యాలయం ప్రారంభం

**రంగారెడ్డి అర్బన్, జూన్3 ,ప్రభాతవార్త :** శంషాబాద్ మండల



జగ్జీవన్ రామ్ సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

పరిధిలోని సిద్ధాంతిలో నిర్మించిన బాబు జగ్జీవన్ రామ్ సంఘం షట్టర్ల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై బాబు జగ్జీవన్ రామ్ సంఘం నాయకులతో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఆయన అడుగు జాడలో నడుస్తూ ఆశలసాధనకు కృషిచేయాలని పేర్కొన్నారు. సిద్ధాంతిలో బాబు జగ్జీవన్‌రామ్ సంఘం షట్టర్లను నిర్మించు కోవడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు,స్థానిక నేతలు ,తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వెంక్యానాయక్

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 3,(ప్రభాతవార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాలని జిల్లెడు చౌదరిగూడ మండల ప్రత్యేక అధికారి వెంక్యానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 4, 6, 8, 10తేదిలలో మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. విడతల వారిగా నిర్వహించే గ్రామసభలకు మండల అధికారులు ప్రత్యేక అధికా రులుగా వ్యవహరించాలని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హన్మంత్‌రెడ్డి, తహసీల్దారు జగదీశ్వర్, ఎపిఓ నర్సింగ రావు, ఎఓ రాజేందర్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వేజర్ శివరాణి, పిఆం ఏఈ వంశీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్‌లో వర్షం

**షాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.



వర్షంతో వాతావరణం చల బడగా, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

# వరి కోత యంత్రంలో చెలరేగిన మంటలు

**కుల్కచర్ల,జూన్ 3 ప్రభాతవార్త :** కుల్కచర్ల శివారులో ఒ రైతు పొలంలోని వరి కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో చైన్ వరి కోత యంత్రంలో బుధవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి.కుల్కచర్ల మండలకేంద్రానికి చెందిన పర్సాపూరం మహేష్ అనే వ్యక్తికి చెందిన వరి కోత యంత్రం కుల్కచర్ల శివారులో వరి పొలాలు కోసేందుకు వెళ్లాగా బ్యాటరిలో మంటలో రావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి హని జరగకపోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.చెలారేగిన మంటలను ఆర్పేందుకు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చిన ఫైర్ ఇంజన్ వెంటనే ఘటన స్థలానికి చెరుకోని మంటలు ఆరిపారు.వరి కోత మిషన్‌లో షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందని బాధితుడు పర్సాపూరం మహేష్ తెలిపాడు.



మిషన్‌లో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

# ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**..మేడ్చల్ జిల్లా విద్యా అధికారిణి రేణుకాదేవి**

**..మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 145ప్రీ-ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 3,ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రీ-ప్రైమరీ స్కూల్స్‌లో ఖాళీగ ఉన్న ఇన్‌స్ట్రక్టర్స్, ఆయా పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు కోరుతున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి పేర్కొన్నారు. బుధవారం ఈ విషయాన్ని డిఇఓ పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు 145ప్రీ-ప్రైమరీ స్కూల్స్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో నడపటానికి ప్రభుత్వం మంజూరు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇన్‌స్ట్రక్టర్స్, ఆయాల పోస్టులకు ఈ నెల జూన్-8వ తేదీ వరకు ధరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్స్‌తో జిల్లాలోని మండలాల ఎంఇఓ రిసోర్సు సెంటర్స్ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు విద్యార్హత ఇంటర్ ఉండాలని, ప్రాధాన్యత శిశు విద్య, ప్రీ-ప్రైమరీ టీచింగ్‌లో అర్హత కల్గిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. వయసు 18నుంచి 44సంవత్సరాల వరకు ప్రభుత్వ నియమాల ప్రకారం రాయితీలు వర్తిస్థాయని అన్నారు. ఆయా పోస్టులకు కనీస అర్హత 7వతరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. వయస్సు 18నుంచి 44సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రాధాన్యత క్రమం..అదే నివాస ప్రాంతం (హ్యాబిటేషన్), అదే గ్రామపంచాయతీ, అదే మండలం, అదే జిల్లాకు చెందినవారై ఉండాలన్నారు. ధరఖాస్తు వివరాలు వివరించారు. అభ్యర్థులు నిర్ణీత ప్రొఫార్మా ధరఖాస్తును సమర్పించాలన్నారు. ఈ ధరఖాస్తులను సంబంధిత మండలాల రిసోర్సు సెంటర్‌లలో మండల విద్యా అధికారులకు ధరఖాస్తుతో పాటు అనుబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు, వయసు రుజువు, నివాస రుజువులు, కుల ధృవీకరణ,ఇతర




శామీర్‌పేట మండలంలోని సింగాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు మంజూరు వచ్చిన పాఠశాల దృశ్యం

పత్రాలను అనుసందించాలన్నారు. ధరఖాస్తుల సమర్పణకు చివరి రోజు జూన్ 8వ తేదీ అని అన్నారు. ఇతర సమాచారం..నియామకాలు పూర్తిగ తాత్కాలికం అవుతాయన్నారు. ఎంపికైన వారికి గౌరవవేతనం, ఒక విద్యా సంవత్సరానికి లేదా 10నెలలు మాత్రమే చెల్లించబడుతుందన్నారు. జిల్లా, మండల స్థాయి ఎంపిక కమిటీల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. అర్హతలేని అభ్యర్థుల ధరఖాస్తులు తిరస్కరించబడుతాయని, అవసరమైతే నియామావళికి లోబడి చర్యలు తీసుకోబడుతాయని అన్నారు.అయితే మండలాల వారీగ ప్రీ-ప్రైమరీ స్కూల్ మంజూరు అయిన వివరాలు మేడ్చల్ మండలానికి 6, దుండిగల్ మండలానికి 7, బాచుపల్లి మండలానికి 5, కుత్బుల్లాపూర్‌కు 20, కూకట్‌పల్లికి 11,బాలానగర్‌కు 10, అల్వాల్‌కు 10, మల్కాజ్‌గిరికి 10, ఉప్పల్‌కు 20, మేడిపల్లికి 10, కాప్రాకు 10, కీసరకు 10, శామీర్‌పేటకు 6, ఘట్‌కేసర్‌కు 10 ప్రీ-ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు కానున్నట్లు తెలిపారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : కెటిఆర్



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డిని అభినందించిన దృశ్యం,పాల్గొన్న వైస్‌చైర్మన్, డైరక్టర్ల,నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 3, ప్రభాతవార్త:**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కె.టి.రామారావు (కెటిఆర్) ను శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, ఆ పాలకవర్గంతో పాటు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, పలువురు పార్టీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డిని సంఘం పురోభివృద్ధి సాధిస్తున్నందున బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఆయనను సన్మానించి పాలకవర్గంను కూడ అభినందించారు. బుధవారం నగరంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్‌ను సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరక్టర్లు వి.భూమిరెడ్డి, ఎల్.నర్సింలుగౌడ్, కె.బిక్షపతి, బాబుసింగ్, మరికొందరు డైరక్టర్లు, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, పలువురు పార్టీ కౌన్సిలర్లు, ఎంసిపల్లి మున్సిపాల్టీ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అయితే బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వంను భారీ ఎత్తున చేయాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని, బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు అండగ ఉంటుందని, గులాబి శ్రేణులు నాయకత్వంను పెంచుకోవాలని, ప్రజల్లో ఉండాలని కెటిఆర్ సూచించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. మూడుచింతలపల్లి మండలం (మున్సిపాల్టీ) లోని వివిధ గ్రామాల నుంచి బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున వెళ్లి ఆయనను కలిసినట్లు తెలిపారు. పార్టీ పరిస్థితి, నాయకుల పనితీరుపై సమీక్షించినట్లు తెలిసింది.

# మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రత, భద్రత మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అనేక మైనార్టీ గురుకుల పాఠశాలలకు ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద మరియు మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాల విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.విద్యార్థుల విద్య, భద్రత, సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన ఎండి ముస్తఫా, ప్రభుత్వం ఈ సమస్యలను అత్యవసరంగా గుర్తించి తగిన చర్యలు చేపట్టి మైనార్టీ గురుకుల పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతిభ చాటిన అఖిలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే సన్మానం

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం దేవుని బండ తండాకు చెందిన విద్యార్థిని డి. అఖిల విద్యా రంగంలో ప్రతిభ కనబర్చడంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆమెను, ఆమె తల్లి తదితర కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అఖిల ఇంట ర్మీడియట్‌లో టాపర్‌గా నిలవడంతో పాటు, ఈఏపీసెట్‌లో 21,536వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో 831వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల బాలికలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షి ంచారు. అఖిల సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో విజయాలు సాధించగలరని అన్నారు. అ ఖిల విజయానికి సహకరించిన ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు అ ఖిలకు శుభాకాంక్షలు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

**షాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** ఈ నెల 13న నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేద్దామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం షాబాద్ లో బాలుర ఉన్నత పాఠశాలలో సంబందించిన గోడపత్రికను వారు



షాబాద్‌లో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

ఆవిష్కరించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ... గత 50 సంవత్సరాల నుండి షాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు అందరూ ఈ నెల 13న ఉదయం 10 గంటలకు బాలుర ఉన్నత పాఠశాల షాబాద్‌లో ఒకే దగ్గర కలవడం చాలా ఆనందరంగా ఉందన్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, పూర్వ విద్యార్థులు ఏగూరి లింగప్ప, శ్రీనుపంతులు, రవీందర్, రాజేందర్ గౌడ్, వెంకటయ్యయాదవ్, కొండ విజయ్ కుమార్, బొబ్బిలి ప్రవీణ్, రవీందర్ గౌడ్, రమేష్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, మల్లికార్జున్, ఎల్. నర్సింహులు, నరేందర్, శివరాజ్ గౌడ్, బాల్జ్, శివకుమార్, శ్రీనివాస్, నర్సింహులు. అన్వర్, షఫీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే ఊరుకోం

**దౌల్తాబాద్,జూన్ 3,ప్రభాతవార్త:** తెలంగాణ సమాజాన్ని,ఇక్కడి ప్రజల అస్తిత్వాన్ని వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా మాట్లాడిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపన చెప్పాలని కొడంగల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్,టీఎంపీఎస్ నియోజకవర్గ ఇంచార్జి కోట్ల హన్మంతు ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు.బుధవారం కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో యూత్



కాంగ్రెస్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ వైఖరికి నిరసనగా భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదని,జోలికొస్తే ఖబడ్దార్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.ఈ సంధర్బంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు జ్ఞానోదయం ప్రసాదించాలంటూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,తెలంగాణ ప్రాంతంపై,ఇక్కడి ప్రజల జీవన విధానంపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.పవన్ కళ్యాణ్‌కు ఈ గడ్డపై మాట్లాడే హక్కు లేదని, బరాబర్ ఈ తెలంగాణ మా జాగీరే అని, ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అయ్య జాగీరే తప్ప పవన్ కళ్యాణ్ జాగీరు కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. నీ రాజకీయం ఏదైనా ఉంటే ఆంధ్రలో చూసుకోవాలని, తెలంగాణతో నీకేం సంబంధం అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే ఇక్కడి సమాజం ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ తన అహంకారాన్ని పక్కన పెట్టి, రాబోయే 24 గంటల్లో తెలంగాణ సమాజానికి బహిరంగ క్షమాపన చెప్పాలని నాయకులు అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో హైదరాబాద్‌లో ఉన్న ఆయన నివాసాన్ని ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని ఈ సంధర్బంగా తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం ఎవరు చేసినా సహించేది లేదని, భవిష్యత్తులో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్‌గోపాల్, రెడ్యానాయక్, నరేందర్, మహిపాల్, రొయ్యల భీములు, చంద్రప్ప, అమర్, సొండే మహిపాల్, భద్రి, శివ, రవి, పాండు, మోహన్‌నాయక్, కృష్ణ,సాయిలు, అంజి, నవీన్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు,యువకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి..

## సర్‌తో ఓటు హక్కును హరిస్తే సహించం

**-పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి..**

**పరిగి, జూన్ 3, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిసన్) తో పౌరుల ఓటు హక్కును హరిస్తే సహించబోమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.బుధవారం వికారాబాద్ జిల్లా,పరిగి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ ల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పరిగి పట్టణంలోని ఎన్.కే. కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ పేరుతో లక్షలాది మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించడానికి ప్రయత్నాలు జరిగా యని,కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో పౌరుల ఆయుధంగా ఉన్న ఓటు హక్కును హరించే చర్యల ను కాంగ్రెస్ పార్టీ సహించబోదని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలతో సర్ ప్రక్రియ పై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం టిపిసిసి ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, అప్రమత్తతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కొన్ని ప్రాంతాల్లో ఓటర్ల పేర్లు తొలగించారని మండిపడ్డారు. కొత్త ఓటర్ల నమోదు విధానం, 18 సంవత్సరాలు పూర్తయిన యువతను ఓటర్లుగా నమోదుచేసే ప్రక్రియ, ఓటరు జాబితాలో పేరు మార్పులు, చిరునామా మార్పులు, తొలగింపులు ,సవరణల కోసం అనుసరించాల్సిన విధివిధానాలను బూత్ ఏజెంట్‌లకు శిక్షణ ఇచ్చారు.కొత్త ఓటర్ల నమోదుకు అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానాలపై కూడా అవగాహన కల్పించారు..సర్ ప్రక్రియపై బిఎల్ఎలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని,అపరమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ట్రైనింగ్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బిఎల్ఏలతో సర్ ప్రక్రియ పై సమగ్ర అవగాహన కల్పించడానికి శిక్షణా కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే టిఆర్ఆర్ తెలిపారు.

**ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడే బాధ్యత బూత్ ఏజంట్‌లదే : జాదవ్ ధారసింగ్ నాయక్....**

సర్ ప్రక్రియలో ఓటర్లను తొలగించకుండా, బిఎల్ఏ లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. ఎస్.ఐ.ఆర్ పేరుతో బిజెపి కేంద్ర ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ తో కుమ్మకై కుట్రపూరితంగా సెక్యులర్ ఓట్లను తొలగిస్తున్నారని, ఆదివాసీ,గిరిజన మైనారిటీ ఓట్లను తొలగించి రాజకీయంగా లబ్ది పొందాలని బిజెపి భావిస్తోందని అన్నారు.బూత్ ఏజంట్ లు అప్రమత్తంగా ఉండి, అర్హత కల్గిన ప్రతి ఒక్కరి ఓటు హక్కులను కాపాడాలని, ప్రక్రియలో ఎటువంటి సమస్య ఉన్న పార్టీ నియమించిన బాధ్యులను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ చైర్మన్ రాజేష్,ట్రైనర్స్ నరేశ్ రాథోడ్, రాజశేఖర్ రెడ్డి మోహన్ లు లు 305 మంది బిఎల్ఎలకు అవగాహన కల్పించారు.. డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి,జనరల్ సెక్రటరీ దండు అశోక్, స్పోక్ పర్సన్ ఆనంద్ గౌడ్, సెక్రటరీ రహీం పటేల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అక్బర్ హుస్సేన్,కాంగ్రెస్ పట్టణ,మండలాల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వెంకట్ రాములు, సురేందర్ శాంత కుమార్,గోపాల్ నాయక్, చంద్రశేఖర్, నారాయణ, లక్ష్మారెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, ఎఎంసి చైర్మన్లు ఆంజనేయులు, పరుశురాం రెడ్డి ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సొంతిటి కల నెరవేర్చడమే లక్ష్యం

**కీసర,జూన్3,ప్రభాతవార్త:**

పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నాగారం డివిజన్ కాంగ్రెసన పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.బుదవారం నాగారం డివిజన్ పరిధిలోని శిల్పనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయ కత్వంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగు నింపు తుందని అన్నారు.5 లక్షల సహాయంతో పేద కుటుంబాలు సొంత ఇల్లు అనే కలను నిజం అవుతుందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు మాదిరెడిదన వెంకట్‌రెడ్డి,పంగ హరిబాబు,సుమిత్ర,మాజీ సర్పంచ్ గూడూరు అశోక్‌గౌడ్,మాజీ ఎంపిటిసిలు ముత్యాలు మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్, నాయకులు కౌకుంట్ల జీవన్‌రెడ్డి,వంగేటి పర్వత్‌రెడ్డి,కౌకుట్ల శ్రీనివాస్‌రెడ్డి,కందాడి శ్రీనివాస్‌రెడ్డి,చిట్యాల శ్రీనివాస్‌రెడ్డి,భద్రు నాయక్,పంగ సంతోష్,సన్నీ యాదవ్, నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT & SESSIONS JUDGE AT SANGAREDDY
I.A.No. 5 OF 2025
IN
A.S.SR.No. 5234 of 2025

Between:
Vijayalaxmi and another ...Petitioners/Appellants
AND
Vadla Shivaiah and others ...Respondents/Respondents

NOTICE

To
Kammari Govindhamma, D/o: Late Mallesh, W/o: K.Balachary, Aged about: 35 years, Occ: House hold, R/o: H.No.2-30/1, Janwada Village Shankarpally Mandal, Rangareddy District.
Respondents No. 13

Whereas, the plaintiff filed the above suit for Declaration recovery of possession and Rectification of entire in the Revenue Records in respect of suit schedule property before the Hon'ble Principal District & Sessions Judge at Sangareddy against you and others, said case is now stands posted on 11-06-2026 for your appearance.

Hence, you are hereby informed to appear before this Hon'ble Court on 11-06-2026 at 10.30 a.m., either in person or through counsel, failing which, the matter will be decided ex-parte as per law.

(By order of the Court)
(K.N. BHASKAR)
Advocate,
Office: #5-8-134/8/7 Near St. Anthony High School, Chanakyapuri Colony, Shanthinagar, Sangareddy
Cell: 8341856443






డీడబ్ల్యుఓ శారద వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

## అంగన్‌వాడి సమస్యపై డిడబ్ల్యుఓ శారద వినతి

**మేడ్చల్, జూన్ 3, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీలోని నూతనకల్ గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడి సెంటర్లల్లో అంగన్వాడి టీచర్లు, ఆయాలను లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారిని ఏర్పాటు చేయాలని కోరుతూ డీడబ్ల్యుఓ శారదకు ఆ గ్రామానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు సురేష్‌రెడ్డి, భాస్కర్‌లు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అంగన్‌వాడి టీచర్ లేక ఒక సెంటర్ పూర్తిగా మూతపడి ఉండగా, రెండో అంగన్‌వాడి సెంటర్‌లో వేరే గ్రామం ఇన్చార్జి టీచంతో తాత్కాలికంగా నడిపిస్తున్నారని, రెండు సెంటర్లకు ఆయాలు లేరని వినతిలో పేర్కొన్నారు. నాలుగు వేల పైచిలుకు జనాభా గల గ్రామంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషికాహారం, అంగన్‌వాడి పిల్లలను పంపే విషయంలో గ్రామస్తులు చాలా ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. నూతనకల్ గ్రామ ప్రజల కోరిక మేరకు రెండు అంగన్‌వాడి కేంద్రాలకు టీచర్లను, ఆయాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విదంగా నూతనకల్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఒక ఆశావర్కర్ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉందని, ఆ ఆయా పోస్టును కూడ భర్తీ చేయాలని కోరారు.

## మే 30న జూనియర్ ఆర్టిస్ట్ భాస్కర్ గుండె పోటుతో మృతి

**మేడ్చల్, జూన్ 3, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలం మునీరాబాద్‌లోని అన్వ కన్వెన్షన్‌లో గత నెల మే 30వ తేదీ సినిమా షూటింగ్ జరుగుతుండగా విషాదకర ఘటన చోటుచేసుకుంది. షూటింగ్‌లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్న నగరంలోని కృష్ణానగర్‌కు చెందిన ఆర్ఎంవి. భాస్కర్ (52) జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నాడు. మునీరాబాద్‌లోని కన్వెన్షన్‌లో జరుగుతున్న సినిమా షూటింగ్‌లో భాస్కర్ 30వ తేదీన రాత్రి సుమారు పదిన్నర గంటల సమయంలో ఆకస్మాతుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అక్కడి నిర్వాహకులు, సహచరులు ఆయనను సమీప ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షి ంచి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటన అనంతరం ఫిర్యాదు అందుకున్న మేడ్చల్ పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు అన్ని విధాల ప్రయత్నాలు చేపట్టగా వారి ఆచూకి లభించలేదు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా కోల్‌కతాకు చెందిన చిరునామా గుర్తించినప్పటికీ, కుటుంబ సభ్యుల వివరాలు, సంప్రదింపు నంబర్లు అందుబాటులో లేవు. అదే విదంగా ఆయన మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా కుటుంబ సభ్యులకు సంబంధించిన ఫోన్ నంబర్లు లభించలేదు. కేవలం తోటి జూనియర్ ఆర్టిస్టులు, స్నేహితులు, ఆయన ఏజెంట్‌కు సంబంధించిన సంప్రదింపు వివరాలు మాత్రమే గుర్తించబడ్డాయి. అతని గురించి ఎవరైనా తెలిసిన వారు ఉంటే వెంటనే మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ఎరువుల కొనుగోలుకు కొత్త ఆప్

**మేడ్చల్, జూన్ 3, ప్రభాతవార్త :** ఎరువుల కొనుగోలు కోసం భారత ప్రభుత్వం కొత్త ఆప్‌ను ప్రారంభించి మేడ్చల్ జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి అమలు చేస్తున్నదని మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి మాదవరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్రేం వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ అనే ఈ ఆప్‌ను గగూల్ ప్లే స్టోర్ నుండి రైతులు డౌన్‌లోడ్ చేసుకుని యూరియానే కాకుండా కాంప్లెక్స్, పొటాష్, డిఎపి, ఎటీపీతో పాటు అన్ని రకాల ఎరువులు ఈ ఆప్ ద్వారానే బుకింగ్ చేసుకుని కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. రైతులకు ఈ ఆప్‌పై ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులను సంప్రదించాలని ఆయన కోరాడు.

## మేకగూడ సింగిల్ విండో డైరెక్టర్ మృతి

**సంతాపం వ్యక్తం చేసిన సింగిల్ విండో చైర్మన్ మంజులారెడ్డి**

**నందిగామ, జూన్ 3, ప్రభాతవార్త :** ఉమ్మడి నందిగామ మండలం మేకగూడ సింగిల్ విండో డైరెక్టర్, మాజీ ఎంపిటిసి యేన్నం బలవంత్ రెడ్డి మృతి చెందారన్న విషాద సమాచారం తెలిసిన ఆ సంఘం చైర్మన్ కంకంటి మంజుల రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె సొసైటీ పాలకవర్గంతో ఇన్ముల్ నర్వ గ్రామానికి వెళ్లి బలవంత్ రెడ్డి భౌతిక కాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బల్వంత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో సొసైటీ సీఈవో వినయ్ కుమార్, డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

**ఆప్త మిత్రునికి అశ్రునివాళి..**

కాంగ్రెస్ పార్టీలో చురుకైన నేత, మంచి సౌమ్యుడు, రైతు పక్షపాతిగా తాను చనిపోయే వరకు రైతుల కోసం తన జీవితం త్యాగం చేసిన రైతుబిడ్డ బలవంత్ రెడ్డి మరణం పట్ల నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986 సంవత్సరం పూర్వ విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థుల్లో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గెలుపులో బల్వంత్ రెడ్డి తనదైన శైలిలో చురుకైన పాత్ర పోషించారు. కడసారి ఆత్మ మిత్రునికి పూర్వ స్నేహితులు షణ్ముఖ చారి, సట్టి వెంకట్ రెడ్డి,దార యాదయ్య, వినయ్ కుమార్, లింగారెడ్డి లు అంత్యక్రియలో పాల్గొని కడసారి నివాళులర్పించారు.

**ఒబిసి నాయకులకు**

## పార్టీలో సముచిత గుర్తింపు నిస్తాం




**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఒబిసి విభాగం చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గాందీభవన్‌లో రాష్ట్ర ఒబిసి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతి త్వరలో జిల్లాల వారీగా సమన్వయకర్తలను నియమించి, జిల్లాల్లో క్రియాశీలకంగా పని చేస్తున్న నాయకులను గుర్తించి జిల్లా ఒబిసి సెల్, రాష్ట్ర ఒబిసి సెల్ కమిటీలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన గుర్తింపు కల్పించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఓబీసీ నాయకుల పాత్ర కీలకమని, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వారిని గుర్తించి ఒబిసి సెల్‌లో వివిధ పదవులు కల్పిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒబిసి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమర్థవంతమైన కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా పార్టీని మరింత పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఒబిసి సెల్ కన్వీనర్లు వెంకటేష్, ధనలక్ష్మి, వివిధ జిల్లాల ఒబిసి సెల్ అధ్యక్షులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో బైక్‌ను ఢీకొట్టిన ఆటో

**ధారూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి తీవ్ర గాయాలు**

**ధారూర్, జూన్ 3, ప్రభాత వార్త:** మద్యం మత్తులో బైకును ఆటో డ్రైవర్ డి కొట్టాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూర్ మండల పరిధిలోని డి. కే తండా సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాన్సింగ్‌ను, కుమ్మరిపల్లి వైపు వెళ్తున్న ఒక ఆటో వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాన్సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని ఇషా హాస్పిటల్‌కు తరలించారు. కాగా, ఆటో డ్రైవర్ భారీగా మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే మాన్సింగ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సున్నం రాఘవేందర్ తెలిపారు.

# హోటల్‌లో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న వివేరా హోటల్ వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడిన ఘటనపై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన కుడుముల రవి (40) మే 31 రాత్రి తన స్నేహితులతో కలిసి హోటల్‌కు భోజనం కోసం వెళ్లాడు. అక్కడ రఘు, నక్కల శ్రీధర్ గౌడ్ మధ్య వాగ్వాదం జరుగుతుండగా, దానిని ఆపేందుకు రవి ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ క్రమంలో శ్రీధర్ గౌడ్‌తో పాటు అతని అనుచరులు రవిని దుర్భాషలాడి, హోటల్ కిచెన్‌లోని కర్రలతో దాడి చేసినట్లు ఆరోపించాడు. ఈ ఘటనలో రవి తలకు గాయం కావడంతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు కూడా గాయాలైనట్లు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 461/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 118(1), 352 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తును పోలీసులు కొనసాగిస్తున్నారు.



ఘర్షణలో తీవ్రంగా గాయపడిన కుడుముల రవి

మరోవైపు మధురాపురం గ్రామానికి చెందిన నక్కల శ్రీధర్ గౌడ్ కూడా ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. ఆయన నిర్వహిస్తున్న వివేరా హోటల్‌కు రఘు చారి తన అనుచరులతో కలిసి వచ్చి, డబ్బుల విషయంలో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు హోటల్‌లో ఉన్న శ్రీధర్ గౌడ్ తమ్ముడు నక్కల ప్రశాంత్ గౌడ్‌పై కర్రలతో దాడి చేయగా, అడ్డుకునేందుకు వెళ్లిన శ్రీధర్ గౌడ్‌పై కూడా దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. అలాగే హోటల్ సిబ్బందిపై దాడి చేసి భయాందోళనలకు గురిచేసినట్లు పేర్కొన్నారు. దుండగులు హోటల్‌లోని అద్దాలు, ఫర్నిచర్, కంప్యూటర్ వ్యవస్థలను ధ్వంసం చేసి ఆస్తి నష్టం కలిగించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ ఎల్. రాజేశ్వర్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.




షాద్ నగర్ బైపాస్ రోడ్డులోని వివేరా హోటల్

# సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్‌కు ఘన సన్మానం

**కొడంగల్, జూన్ 3ప్రభాతవార్త**

కొడంగల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో 9 సంవత్సరాలకు పైగా సీనియర్ అసిస్టెంట్‌గా విశేష సేవలందించి బదిలీపై వెళ్తున్న మనోజ్‌కుమార్‌ను బుధవారం కొడంగల్ పీఆర్టీయూ మండల వాఖ,టీఎస్‌జీఆర్ఈఏ సంఘాల ప్రతినిధులు సంయుక్తంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు అబ్దుల్‌హాక్, దినేష్‌సింగ్, ఏసురత్నంలతో పాటు తెలంగాణా రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, రాధాకృష్ణ, యాదగిరి, గోపినాథ్, మురళి తదితరులు మాట్లాడుతూ ఈ సుదీర్ఘ కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు మనోజ్‌కుమార్ అందించిన సహాకారం, సేవలు ఎంతో అభినందనీయమన్నారు. వారి నూతన ఉద్యోగ బాధ్యతలలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మనోజ్‌కుమార్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు.



బదిలీపై వెళ్తున్న మనోజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

# సురంగల్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ



కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి లక్ష రూపాయల విరాళం

**మొయినాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ వచ్చింది. పాతబడిన పాఠశాల భవనానికి నూతనంగా రంగులు వేయించేందుకు 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ యాలాల జైపాల్ రెడ్డి లక్ష రూపాయలను విరాళంగా అందించారు. కౌన్సిలర్ విజ్ఞప్తి వెంటనే స్పందించిన నే14వ వార్డు కౌన్సిలర్ కర్రల శ్రీధర్ పాఠశాల పరిస్థితిని వివరించి, రంగులు వేయించాలని జైపాల్ రెడ్డిని కోరగా, ఆయన వెంటనే స్పందించి లక్ష రూపాయలు అందజేశారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు తన వంతు సాయం అందిస్తానని ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్, తల్లిదండ్రుల హర్షంపాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చి ఆర్థిక సాయం చేసిన జైపాల్ రెడ్డికి పాఠశాల ప్రిన్సిపల్ జహీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సైతం జైపాల్ రెడ్డిని అభినందించారు. ప్రభుత్వ బడి పిల్లల భవిష్యత్తుకు ఈ సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు."ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడి" కౌన్సిలర్ శ్రీధర్ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రల శ్రీధర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ బడుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా చదువుల్లో ర్యాంకులు సాధిస్తున్నారు. కానీ సౌకర్యాల పరంగా ప్రైవేట్, ప్రభుత్వ బడుల మధ్య వ్యత్యాసం ఉంది. ప్రభుత్వ బడులు కూడా అందంగా, ఆకర్షణీయంగా ఉండాలి. ఎక్కడో మూలన ఉన్నట్లు కనిపించకూడదు అనే ఉద్దేశంతోనే ఈ రంగులు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం" అని తెలిపారు. విద్యకు విరాళం దేశ భవిష్యత్తుకు సాయందేశానికి ప్రయోజకులను తయారుచేసే బడికి సాయం చేసిన జైపాల్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వ బడి పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ రెడ్డి, ఎల్లని అశోక్ గౌడ్ యాలాల మాధవరెడ్డి, బొర్రా జగన్, షేర్ బాయ్ శ్రీకాంత్ రెడ్డి, దుర్గం నరేష్, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# వ్యవసాయ విస్తరణ అధికారులకు ఘన సన్మానం

**మొయినాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** గత కొన్ని సంవత్సరాలుగా మొయినాబాద్ మండల వ్యవసాయ శాఖ కేతిరెడ్డిపల్లి క్లస్టర్లో విధులు నిర్వహిస్తూ రైతులకు అండగా నిలిచి, వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) అందించిన సేవలు మరువలేనివని రంగారెడ్డి జిల్లా మత్స్యకారుల సహకార సంఘం చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల వ్యవసాయ శాఖ కార్యాలయం కేతిరెడ్డిపల్లి క్లస్టర్లో పనిచేస్తు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. సునీల్ కుమార్, ఏ. కుమార్‌లకు వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల ముదిరాజ్ సంఘం నాయకులు అధికారులను శాలువాలతో సత్కరించి, పూలమొక్కలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై మొయినాబాద్ మండల వ్యవసాయ శాఖలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, దీనా. లకు ఘన స్వాగతం పలికారు. వారికి శాలువాలు కప్పి, పూలమొక్కలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు సకాలంలో అందేలా కృషి చేయడంతో పాటు, పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ వంటి అంశాలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తూ సునీల్ కుమార్, కుమార్ రైతుల మన్ననలు పొందారని కొనియాడారు. రైతుల సమస్యలను తమ సమస్యలుగా భావించి పనిచేసిన వారి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు కూడా రైతులకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి




రైతుకు చేరేలా కృషి చేసి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని ఆకాంక్షి ంచారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే వ్యవసాయ శాఖ ప్రధాన లక్ష ్యం..మండల వ్యవసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే వ్యవసాయ శాఖ ప్రధాన లక్ష ్యమని, రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు నిరంతరం పనిచేయాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న అధికారుల సేవలను కొనియాడుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బండి అనిల్ ముదిరాజ్, మాడి దినేష్ రెడ్డి, రెడ్డి మోని యాదయ్య ముదిరాజ్, మాదాపురం విజయరాజ్, తలారి నరేష్, బుచ్చిరెడ్డి తదితర నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అధికారులు తమకు అందించిన గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మీరుఖాన్ పేట్, బేగర్ కంచ పరిధిలోనే మెడికల్ కాలేజీని నిర్మించాలి

## మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి డిమాండ్

**కందుకూరు. జూన్ 3. (ప్రభాతవార్త):**

ప్రజా సంక్షేమం ఈ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆనాటి బిఆర్ఎస్ నాయకత్వంలోని కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వం కందుకూరు మండలం మిర్ఖాన్పేట్ రెవెన్యూ పరిధిలోని బేగరి కంచ పరిధిలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడంతో పాటు 400 ఆసుపత్రి నిర్మాణానికి మంజూరి ఇవ్వడం జరిగిందని దానికి సంబంధించి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం జరిగిందని మహేశ్వరం శాసనసభ్యులు మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కందుకూరు మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల ప్రత్యేక సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ ప్రాంతానికి మంజూరైన మెడికల్ కాలేజీని ఆసుపత్రిని ఇక్కడి నుండి మార్చి ఎల్బీనగర్ ప్రాంతానికి తరలించడం జరిగిందని ఇది ఈ ప్రాంత ప్రజలను మోసం చేయడమేనని ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మారు మూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో 400 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని దృఢ సంకల్పంతో శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. వైద్య కళాశాలను, 400 పడకల ఆస్పత్రిని ఈ ప్రాంతం నుండి తప్పించడం దురదృష్టకరమని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో



మెడికల్ కాలేజీని ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజల పక్షాన నిలిచి బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమం చేపడుతుందని పాలకులకు బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. అభివృద్ధికి ఎవరు వ్యతిరేకం కాదని అయితే రాజకీయ స్వార్థం కోసం ఆనాటి పాలకులు ప్రతిపాదించిన పనులను రద్దు చేయడం తప్పించడానికి చేసే పన్నాగాలను బి ఆర్ ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు మన్నే జయేంద్రతో పాటు నాయకులు సుసాని సురేందర్ రెడ్డి, గంగాపురం లక్ష్మీ ్మ నరసింహ రెడ్డి, కాకి దశరథ, లేమూరు సర్పంచ్ మేఘనాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సురసాని రాజశేఖర్ రెడ్డి, కాకి రాములు, నాయకులు ఇందిరా దేవేందర్ తాళ్ల కార్తీక్, ప్రకాశ్ రెడ్డి, దీక్షి త్ రెడ్డి, ఇందిరా శ్రీహరి, బర్కం వెంకటేష్, దేవిలాల్, రామకృష్ణారెడ్డి, దర్శన్ రెడ్డి, పాండు, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## దైవచింతనతో మానసిక ప్రశాంతత

**సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**

**కడ్తాల్, జూన్ 3, ప్రభాత వార్త :** దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల్ చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్‌గా గూడూరు జంగారెడ్డి, సభ్యులుగా రమేష్ గౌడ్, పిప్పళ్ళ యాదయ్య, బాచిరెడ్డి మంజుల, రాంచందర్ నాయక్‌లను ఆలయ ఈవో మోహన్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గంప వెంకటేష్ గుప్తా ఆలయ చైర్మన్ గూడూరు జంగారెడ్డితోపాటు సభ్యులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన శక్తి మేరకు కూడా కృషి చేస్తానని గంప వెంకటేష్ గుప్త తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు కేశవులు గౌడ్, నాగరాజు, కొప్పు కృష్ణ, డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అమృతం పాండు, కృష్ణ, గుద్దేటి సత్యనారాయణ గుప్తా, గుద్దేటి వెంకటేష్ గుప్తా, గుద్దేటి వీరేందర్ గుప్తా, గూడూరు సురేందర్ రెడ్డి, బాచిరెడ్డి రమణారెడ్డి, ఏ సంతోష్, కంబాలపల్లి అంజి, రామచంద్రి, మంగళపల్లి నరసింహ, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శారదా బిచ్చా నాయక్, బాచిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**..అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి**



అలియాబాద్ మున్సిపల్‌లోని 9వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న కమిషనర్, వైస్‌చైర్మన్,కౌన్సిలర్లు తదితరులు

**శామీర్‌పేట, జూన్ 3, ప్రభాతవార్త:**

అలియాబాద్ మున్సిపాల్టీ 9వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీలోని 9వ వార్డులో మున్సిపల్ సాదారణ (జనరల్) నిధులు 5లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఆ వార్డులో మురికినీటి సమస్యను పరిష్కరించటానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, వార్డుల కౌన్సిలర్లు వి.యమునశ్యామ్, కైర గణేశ్, గాదె వెంకటేశ, మౌనిక వంగరి, హపవత్ వెంకటేశ్, సామాల జశ్వంత్‌రెడ్డి, మున్సిపల్ డిఇఇ మహిపాల్, పలువురు నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్కెపల్లి ఆదర్శ పాఠశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి ఆహ్వానం

**పూడూరు, జూన్ 3, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ (మహిళ) 1,నైట్‌వాచ్‌ఉమెన్ 1 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు మండల విద్యాధికారి సాయిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని, అసిస్టెంట్ కుక్‌కు రూ. 6500, నైట్‌వాచ్ ఉమెన్‌కు రూ. 8710 నెలజీతం చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని స్థానికులకు మొదటి ప్రాధ్యాత ఉంటుందని, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 8వతేదీ ఉదయం 10గంటలకు ఎన్కెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**డిసిసి డైరెక్టర్, సహకార సంఘం చైర్మన్ అంజిరెడ్డి**

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ అంజిరెడ్డి తదితరులు.




**మోమిన్‌పేట్, జూన్ 3. ప్రభాతవార్త:** మండల పరిధిలోని మేకవనంపల్లి ప్రాథమిక సహకార సంఘంలో డిసిసి సభ్యులు, సహకార సంఘం చైర్మెన్ పట్లోళ్ల అంజిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు పండించిన జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు మధ్య వర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఎలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు సంబందిత ఎఇఒ దగ్గర ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ అవసరమైన ధృవపత్రాలను కొనుగోలు కేంద్రంలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొనింటి సుశీల, సొసైటీ వైస్ చైర్మెన్ వినయ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, సీఈఒ జాహంగీర్, సిబ్బంది రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ గ్రేడ్1 గ్రంథాలయానికి నూతన లైబ్రేరియన్

**షాద్‌నగర్, జూన్ 3, ప్రభాతవార్త :** షాద్‌నగర్ గ్రేడ్1 గ్రంథాలయానికి నూతన లైబ్రేరియన్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. వెంకటయ్యని గ్రంథాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గ్రేడ్1 లైబ్రరీ కమిటీ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి వెంకటయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు నక్క బాలరాజ్, వీరేష్ కుమార్, జనరల్ సెక్రటరీ క్యాసెట్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ జూపల్లి చంద్రశేఖర్, జాయింట్ ట్రెజరర్ కత్తి చంద్రశేఖరప్ప తదితరులు పాల్గొని నూతన లైబ్రేరి యన్‌ను శాలువాతో సన్మా నించి శుభాకాంక్షలు తెలి పారు. గ్రంథాలయ సేవ లను మరింత మెరుగుపం చేందుకు కృషి చేస్తానని నూతన లైబ్రేరియన్ బి. వెంకటయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నూతన గ్రంథాలయాధికారికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది